క్లుప్తంగా

తూప్రాన్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



తూప్రాన్: తూప్రాన్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ వెల్దుర్తి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. చంద్రశేఖర్‌రెడ్డి మనోహరాబాద్ మండలం నుంచి తూప్రాన్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ప్రజలకు రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

గురుకులానికి డెస్కులు, బెంచీలు అందజేత



మాట్లాడుతున్న దాత టీవీపీ చారి

చేగుంట(తూప్రాన్): గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదివి గొప్పగా ఎదగాలనే ఉద్దేశంతో గిరిజన గురుకుల పాఠశాలకు తనవంతు సాయంగా డెస్కులు అందజేసినట్లు దాత నార్సింగి ఆస్పత్రి డాక్టర్ టీవీపీ చారి అన్నారు. బుధవారం చేగుంట బాలికల గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాలకు రూ.3.50 లక్షల విలువ చేసే డ్యూయల్ డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బాలికలు సైతం మంచి వసతులతో చదవుకోవాలనే ఉద్దేశంతో డెస్కులు, బెంచీలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, ఆర్సీఓ గంగారాం నాయక్, గురుకుల ప్రిన్సిపాల్ సుమతి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, నాయకులు పరంజ్యోతి పాల్గొన్నారు.

కౌడిపల్లి తహసీల్దార్‌గా కృష్ణ



కృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల తహసీల్దార్‌గా జి కృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో ఇదివరకు విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయన గతంలో వెల్దుర్తి, టేక్మాల్ మండలాల తహసీల్దార్‌గా పనిచేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న కరుణాకర్

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హవేళిఘణాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కరుణాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులకు మంచి విద్యనందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, రమేశ్, అశోక్, మల్లేశం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఆంజనేయులు



ఆంజనేయులు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ తహసీల్దార్‌గా ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కౌడిపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తూప్రాన్‌కు బదిలీపై వెళ్లారు.

విద్యార్థికి సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): బాసర ఐఐఐటీ విడుదల చేసిన రెండో విడత జాబితాలో పదవ తరగతి ఫలితాల్లో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిన వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రశేఖర్‌గౌడ్ అర్హత సాధించాడు. దీంతో బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

అదనపు కలెక్టర్ నగేశ్



మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

నర్సాపూర్: స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే, వారు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళాను ప్రారంభించి మాట్లాడారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మేళా ద్వారా ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, వారి పరిధిని విస్తరించడానికి, వారి సంస్థలు స్థిరమైన అభివృద్ధి సాధించడానికి దోహదపడుతుందని వివరించారు. కాగా మేళాలో పాల్గొన్న పలువురు మహిళలతో మాట్లాడిన అదనపు కలెక్టర్ వారు తయారుచేసిన వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి, మేనేజర్ మధుసూదన్, మెప్మా పీడీ హన్మంతరెడ్డి, కోఆర్డినేటర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో దివ్యాంగులు ఉపకరణాల దరఖాస్తులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పరికరాల ఎంపిక కోసం 122 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వారి ధ్రువపత్రాలను పరిశీలన చేస్తున్నామని, త్వరలో అర్హులైన దివ్యాంగులకు పరికరాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారిణి హైమావతి, డీఆర్డీఓ, రవాణాశాఖ అధికారి విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనిలా, డీపీఓ యాదయ్య సంబంధిత దివ్యాంగులు పాల్గొన్నారు.

వరిలో పీఎస్బీ వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రవికుమార్ తదితరులు

కొల్చారం(నర్సాపూర్): వరి పాస్ఫరస్ సాల్యూబైజ్ బ్యాక్టీరియా (పీఎస్బీ) ఉపయోగించే విధానం, లాభాలపై మండలంలోని రంగంపేటకు చెందిన రైతు పొలంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, రంగంపేట ఏఓ రాజశేఖర్ గౌడ్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు భాస్వరపు ఎరువులను అధికంగా వినియోగించడం తగదన్నారు. నేలలో భాస్వరపు నిల్వలు పెరిగినప్పుడు మొక్కకు కావాల్సిన సూక్ష్మ పోషకాలైన జింకు, బోరాన్, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాలు అందకుండా మొక్క ఎదుగుదల లోపిస్తుందన్నారు. రైతులు పీఎస్బీని ఉపయోగించాలని సూచించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



విద్యుత్‌శాఖ జిల్లా అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఖాజాపూర్ తండానాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాలో నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నారాయణనాయక్‌కు తండావాసులు వినతి పత్రం అందించారు. జాన్సిలింగాపూర్ సబ్‌స్టేషన్ నుంచి ఖాజాపూర్ తండాకు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. విద్యుత్‌లైన్ పంట పొలాల నుంచి ఉండటంతో విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయని, దీంతో విద్యుత్ సరఫరా ఆగుతుందన్నారు. మేన్‌రోడ్డుపై నూతన విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసి తండాలోని కరెంట్ కష్టాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజాపూర్‌తండా నాయకులు డాక్టర్ శివ, బాబునాయక్, సూర్యప్రకాష్, తండా లైన్‌మెన్ నరేష్ ఉన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

రామాయంపేట(మెదక్): నూతనంగా ఎన్నికైన స్థానిక మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగారావు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు మర్కు గంగారాం, పిట్ల ప్రకాశ్, బైరం స్వరూప, అనిత సంతోష్‌కుమార్, భూమ కిషన్, గూడాల లింగం, బీర రామచంద్రం, మంగళి సత్తయ్య, మంజుల, సామాల రవి ప్రమాణం స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఆలయ ట్రస్టీ పాండురంగాచారి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధి కోసం సభ్యులు కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను స్థానికులు సన్మానించారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రమేశ్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు

నాయబ్ తహసీల్దార్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): నాయబ్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రాజేశ్వరీ వేరేచోటుకు బదిలీకాగా తూప్రాన్ మండలంలో ఎఫ్ఎస్‌సీ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. మండలంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్ చెప్పారు.

పల్లె ప్రకృతి వనం ధ్వంసం



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

రేగోడ్(మెదక్): మండలంలోని దోసపల్లిలో పల్లె ప్రకృతి వనంలో గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రి, మొక్కలను ధ్వంసం చేసి ఫెన్సింగ్‌ను తీసేశారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చయ్య తహసీల్దార్,, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్‌లో అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ క్రమంలోనే దోసపల్లిలో కూడా ఇరవై గుంటల భూమిని కేటాయించి అందులో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామాల్లో తాము పచ్చదనానికి కృషి చేస్తే.. కొందరు జేసీబీతో మొక్కలను సైతం ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం నేరం కాదా అని ప్రశ్నించారు. ఇందుకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గుర్నాథ్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

తెగుళ్ల నివారణకు ఆధునిక పద్ధతులు



పీఎస్‌బీ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

వెల్దుర్తి(తూప్రాన్): ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతులు పంటలు పండించి అధిక దిగుబడులు సాధించాలని మాసాయిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంటపొలాలను సందర్శించి తెగుళ్ల నివారణకు అవలంబించే పీఎస్‌బీ (పాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా) విధానంపై క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా నాటు వేసే ముందు వరి నారు చివర ఆకులని కత్తిరించి లేదా తుంచి నాటు వేయాలని సూచించారు.

వామ్మో నాగుపాము

విద్యార్థుల భయాందోళన



తరగతి గదిలోకి వచ్చిన నాగుపాము

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం టీ.మాందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలోకి వచ్చిన నాగుపాము హల్‌చల్ చేసింది. బుధవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు ప్రార్థన చేసి తరగతి గదిలో కూర్చున్నారు. ఉపాధ్యాయుడు అశోక్ పాఠాలు బోధిస్తున్న సమయంలోనే నాగుపాము తరగతి గదిలోకి వచ్చింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు ముందుగా విద్యార్థులను బయటకు పంపించారు. అనంతరం దాన్ని కొట్టి చంపేశారు. కాగా పాఠశాలకు పంటపొలాలు ఆనుకుని ఉండటంతో నాగుపాము తరగతి గదిలోకి వచ్చిందని ఉపాధ్యాయులు తెలిపారు.

సంకాపూర్‌లో తాగునీటి కష్టాలు



పొలాల వద్ద నుంచి బిందెలలో నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కాకపోవడంతో నార్సింగి మండలం సంకాపూర్ గ్రామస్తులు తాగునీటి కోసం అనేక కష్టాలు పడుతున్నారు. మూడు రోజులుగా నీటి సరాఫరా నిలిచిపోవడంతో వ్యవసాయ పంట పొలాల నుంచి నీళ్ల తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని భగీరథ అధికారులు చెబుతున్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో గ్రామస్తులు నీటి కోసం పంట పొలాల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరాఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ మాణిక్యం

వెల్దుర్తి(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం అన్నారు. ఈ మేరకు మాసాయిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మోడల్ హౌస్ ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరిగితే లబ్ధిదారులకు ఆర్థికభారం ఉండదని, నిబంధన ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను బట్టి విడతల వారీగా బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయన్నారు. పీడీ వెంట పంచాయతీ కార్యదర్శి రాణి ఉన్నారు.

రూ.10లక్షల వడ్డీలేని రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం సంగమేశ్వర్

ఏపీఎం సంగమేశ్వర్

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇస్తుందని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో మండల కేంద్రమైన కౌడిపల్లి రెండవ గ్రామసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10లక్షలు వడ్డీలేని రుణాలు వచ్చాయన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. వృద్ధులు, వికలాంగులకు, కిశోర బాలికలతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పూర్ణిమ, సీసీ రమేస్, వీఓఏ యేసు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ పార్టీ స్థానిక నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు శేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలో స్థానిక ఎన్నికలలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజలతో కలిసి సమస్యలపై పోరాడాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. అనంతరం ఆత్మకమిటీ డైరక్టర్ భిక్షపతి పుట్టినరోజు కావడంతో విషయం తెలుసుకున్న కేటీఆర్ ఆయనను శాలువాతో సత్కరించారన్నారు. వీరి వెంట మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నరేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): అయిల్‌పామ్ సాగు తో రైతులకు అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని బుజ్రాన్‌పల్లి శివారులో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. 90 శాతం సబ్సిడీపై మొక్కలు అందజేస్తున్నామని, దీంతో పాటు డ్రిప్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ కృష్ణ, ఏఈఓలు మమత, అఖిల్, వినీత్, లీఫ్‌పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణారావు, అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ రైతులు పాల్గొన్నారు.

బీజేపీని విమర్శించే హక్కు 'పంజా'కు లేదు

రామాయంపేట(మెదక్): రోజుకో పార్టీ మారుతున్న పంజా విజయకుమార్‌కు తమ పార్టీని విమర్శించే స్థాయి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. పార్టీలో బీసీలకు ప్రాధాన్యత లేదని పంజా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఒక బీసీ అని గుర్తించే గత అసెంబ్లీ ఎన్నికల్లో పంజాకు టికెట్ ఇచ్చారని రాములు గుర్తుచేశారు. పంజా గతంలో పలుమార్లు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు ఎంపీ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ గురించి మాట్లాడే నైతిక హక్కు పంజాకు లేదని, రాజాసింగ్ స్వయంగా తానే రాజీనామా చేశారని, ఇప్పటికీ ఆయన పార్టీ కార్యకర్తనేనని రాములు పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అమ్ముడు పోయిన పంజా బీజేపీ గురించి అవాస్తవాలు మాట్లాడితే సహించమని హెచ్చరించారు.

నూతన నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇన్‌క్రిడిబుల్ టీవీ అండ్ మూవీ ఆర్టిస్ట్ ఫెడరేషన్ (ఫైమా) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సిద్దిపేట పట్టణానికి చెందిన రవితేజను నియమించారు. బుధవారం హైదరాబాద్‌లో ఫైమా సంస్థ వ్యవస్థాపకులు, జాతీ య అధ్యక్షుడు చంగారపు నరోత్తం కుమార్ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ నియామ కం రెండు సంవత్సరాలు ఉంటుందని చెప్పారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి



రత్నపూర్‌లో సమావేశమైన రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధి రత్నపూర్‌లో బుధవారం ట్రిపుల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పరిహారం వల్ల బయట మార్కెట్‌లో భూములు కొనుగోలు చేసేందుకు డబ్బులు సరిపోవని, రైతుల ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వం పరిహారం పెంచాలని కోరారు. ఈ విషయంపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించనున్నట్లు వారు చెప్పారు. న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం అందజేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, మహేష్, భాస్కర్, నరేష్, తదితరులు ఉన్నారు.

◆ ఫలహారం బండి ఊరేగింపునకు రండి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మహంకాళి బోనాల సందర్భంగా ఫలహారం బండి ఊరేగింపునకు రావాలని ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. చేగుంట యూత్ నాయకుడు రాజు ఆధ్వర్యంలో ఈనెల 21న ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మాజీ ఎంపీటీసీ సత్తయ్య మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ నాయికోటి సత్తయ్య(70) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలియడంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట నాయకులు శ్యాంసుందర్‌రావ్, కాంతారావ్, మహిపాల్‌రెడ్డి, ఎల్లం, పోలనవీన్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

◆ 19న ప్రజాదర్బార్

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనులపై ఈ నెల 19న ప్రజాదర్బార్ (సోషల్ ఆడిట్)ను నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాలలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ ఉంటుందని, టీఏలు ఎఫ్ఏలు తమ నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

◆ ఇందిరమ్మ లబ్ధిదారుల ఐరిష్ తప్పనిసరి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని ఇందిరమ్మ లబ్ధిదారులు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తమ ఐరిష్ స్కాన్ చేసుకోవాలని నార్సింగి ఈఓ నాగభూషణం కోరారు. మండల కేంద్రంలో 96 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులు కుటుంబ యజమాని, లబ్ధిదారు ఇద్దరు గ్రామపంచాయతీ వద్దకు బ్యాంకు అకౌంట్, జాబ్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు తీసుకుని రావాలని సూచించారు. ఐరిష్ స్కాన్ చేసుకోనట్లయితే ఇందిరమ్మ ఇళ్లు రద్దు కానుందని హెచ్చరించారు.

◆ రైతుపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

నిజాంపేట(మెదక్): రైతుపై దాడి చేసి గాయపర్చిన ఇద్దరిపై నిజాంపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పట్నం రాజు, అశోక్, శ్రీశైలంకు మధ్య కొంతకాలంగా భూసమస్యకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాజు తన వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా, అశోక్, శ్రీశైలం అతడితో గొడవపడి దాడి చేసి గాయపర్చారు. తనపై హత్యాయత్నం చేశారని బాధితుడు రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రాజేశ్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి, ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కార్తీక్, బస్వలింగం, నితిన్, రాజు కిరణ్, రాజు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.